జీరో టిల్లేజ్‌తో మొక్కజొన్నపై ఆసక్తి

సీతానగరం: మండలంలోని రైతులు వరిచేను కోసిన పొలాల్లో దుక్కిదున్న కుండా రెండవ పంటగా మొక్క జొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన తామరఖండి, చినభోగిలి, బగ్గందొరవలస, కొత్తవలస గ్రామాల్లో మాగాణి భూముల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపంటపై తెగులును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుక్కి దున్నకుండా పంట సాగు చేసే విధానాన్ని జీరోటిల్లేజ్ అంటారన్నారు. వరికోత అనంతరం దుక్కి దున్నకుండా జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్క జొన్న సాగుచేయడం వల్ల సాగుచేసే సమయం, ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేయడం ద్వారా తక్కువ సమయంలో అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని, ఈ విధానంలో ప్లగ్‌మార్కర్‌తో లేదా తాడు ఉపయోగించి కర్రతో గాని విత్తుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


చినభోగిలిలో జీరోటిల్లేజ్ మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి

- ఏపీ నవరత్నాల కమిటీ వైస్‌చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి


మాట్లాడుతున్న అంకంరెడ్డి నారాయణమూర్తి

పార్వతీపురం: కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఏపీ నవరత్నాల కమిటీ వైస్‌చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చినబొండపల్లి గ్రామ పరిధిలో కొప్పులవెలమ ఆత్మీయ సభ (వనభోజనం)ను సంఘం గౌరవ అధ్యక్షుడు చుక్క భాస్కరరావు, జిల్లా అధ్యక్షుడు చల్లారపు రమేష్‌నాయుడుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల వెలమ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావులు మాట్లాడుతూ రాజకీయ, వైద్య, న్యాయవాద, వ్యాపార రంగాలలో కొప్పులవెలమ కులస్థులు రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. వివిధ హోదాలలో గుర్తింపు ఉన్న వారు గ్రామాల్లో అభివృద్ధిపనుల్లో పాలుపంచుకోవడంతో పాటు, నిరుపేదలకు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు గీసిన నఖ చిత్రాలతో కూడిన 'నఖ చిత్రాయణం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, డి.శ్రీదేవి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు యాళ్ల వివేక్, వైవీ.పద్మజ, పి.వసంత్‌కుమార్, కిలపర్తి పరిశినాయుడు, బొమ్మినాయుడు తిరుపతిరావు, శంబంగి రమేష్, మర్రాపు పురుషోత్తంనాయుడు, నంగిరెడ్డి మధుసూదనరావు, గులిపల్లి సుదర్శనరావు, బొంగు చిట్టిరాజు, బలగ నాగేశ్వరరావు, ద్వారపురెడ్డి ధనుంజయరావు, పల్ల రాంబాబు, గొట్టాపు వెంకటనాయుడు, డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్, కార్యదర్శి చొక్కాపు వెంకటరమణ, కోశాధికారి మరిశర్ల కార్తీక్‌నాయుడుతోపాటు వివిధ గ్రామాలనుంచి పలువురు విచ్చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురంలో నిర్మాణంలో ఉన్న కొప్పులవెలమ సంఘం భవనానికి పలువురు విరాళాలు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యక్రమం సందడిగా జరిగింది.

నేత్ర వైద్యసేవలు అంతా వినియోగించుకోవాలి

పార్వతీపురంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2 వ తేదీ నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నిర్వహించనున్న నేత్ర పరీక్షలపై జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో ఆదివారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య అధికారులు, నేత్ర వైద్య సహాయకులకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి, పేషెంట్‌కి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలనే అంశాలపై అవగాహన కల్పించారు. గతంలో పాఠశాలల్లో కంటి తనిఖీలు చేసిన వారిలో దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు గత కార్యక్రమంలో నేత్ర పరీక్షలు చేసిన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు సురక్ష పోర్టల్‌లో ఎలా పొందుపరచాలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి వరించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నేత్ర వైద్య అధికారి శ్రీనివాసరావు శస్త్ర చికిత్సల కోసం పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు

అంగన్‌వాడీ సిబ్బంది మా కుటుంబ సభ్యులే..

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అంగన్‌వాడీ సిబ్బంది మా కుటుంబ సభ్యుల్లాంటి వారేనని, వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతృప్తిగా ఉన్నారన్నారు. సిబ్బంది సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, ఆయన క్యాబినెట్ సభ్యులతో చర్చించి న్యాయం చేస్తారని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామివారికి తిరువీధి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఆదివారం గోవింద మాలాధారణ చేసిన భక్తులు నగరసంకీర్తనలు, తిరువీధి చేసి మేల్కొపులు ఆలపించారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గోవింద మాలాధారణ చేసిన భక్తులు స్వామివారిని ప్రత్యేక అలంకరణలో పల్లకిలో అధిష్టించి ఆలయ అర్చకులతో కలిసి పల్లకిలో తిరువీధి నిర్వహిస్తూ గోవిందనామాలు ఆలపించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ భక్తులు ముందుగా సువర్ణముఖి నదిలో స్నానాలు చేసుకుని వేణుగోపాలస్వామి, గోదా దేవికి పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి మార్కెట్ మీదుగా రాష్ట్ర రహదారిలో ఉన్న హనుమాన్ జంక్షన్ వరకూ గోవిందనామాలతో మేల్కొలుపులు, నగర సంకీర్తన చేస్తూ తిరిగి వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకున్నట్లు చెప్పారు. జనవరి 15వ తేదీవరకూ ధనుర్మాసం పూజలు జరుగుతాయని తెలిపారు.


స్వామివారిని పల్లకిలో తిరువీధి చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

టిడ్కో ఇళ్ల పంపిణీపై సమీక్ష

సాలూరు: టిడ్కో ఇళ్ల పంపిణీపై ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొరతో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చర్చించారు. పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆదివారం జరిగిన చర్చలో జమ్మాన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్లు పూర్తవ్వగా.. త్వరలోనే విద్యుత్ సంబంధిత పనులు పూర్తి చేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం సుమారు 60 లక్షల రుపాయల చలానాలు తీసి ఇళ్లు మంజూరు కాని వారు ఉన్నారని, వారికి డబ్బులు తిరిగి చెల్లించాలని మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. దీంతో జమ్మాన వెంటనే టిడ్కో ఎం.డితో ఫోన్‌లో మాట్లాడి సమస్య వివరించారు. జనవరి మొదటి వారంలో 1056 టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తామని జమ్మాన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనకాపల్లిలో జనవరి మొదటి వారంలో జరిగే టిడ్కో ఇళ్ల పంపిణీకి హాజరుకావాలని ఉపముఖ్యమంత్రిని ఈ సందర్భంగా జమ్మాన కోరారు.


మంత్రి రాజన్నదొరతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

క్యాలెండర్ ఆవిష్కరణ

సాలూరు: పీఆర్‌టీయూ రూపొందించిన క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, నాయకులు తవిటినాయుడు, విజయ్, అప్పలనాయుడు, గుణరాజు, కృష్ణారావు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పక్కిలో ఎమ్మెల్యే జోగారావుకు సత్కారం


బొబ్బిలి వీణతో ఎమ్మెల్యే అలజంగి జోగారావును సత్కరిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే ఎస్‌వీసీహెచ్ అప్పలనాయుడు, వేణుగోపాలనాయుడు

సీతానగరం: రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం బొబ్బిలి మండలంలోని పక్కిలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావును జాతీయస్థాయిలో పేరు గాంచిన బొబ్బిలి వీణతో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు సత్కరించారు. కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బలిజిపేట జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, బలిజిపేట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవలస మురళి పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

పార్వతీపురం టౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024వ సంవత్సరం ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సంపద, సమృద్ధి కలగాలని ఎమ్మెల్యే జోగారావు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే విధంగా కృషి చేస్తుందని చెప్పారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వంపై ఆశీస్సులు, దీవెనలు అందిస్తారని ఆశిస్తూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.